సాక్షి
పెద్దపల్లి
శనివారం । 22 । జూన్ । 2024



మంత్రపురిలో వ్రతం

మంథని: మంత్రపురిలో శుక్రవారం వట సావిత్రి వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మర్రిచెట్టు కింద సావిత్రీ సత్యవంతుడు, గొడ్డలి ప్రతిమలు ఉంచి వ్రతం చేశారు.



రంగనాథస్వామి రథోత్సవం

పెద్దపల్లిరూరల్: బొంపల్లి శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం జరిగింది. ఎమ్మెల్యే విజయరమణా రావు, భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
38.4/26.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా నమోదయ్యే అకాశం ఉంది. పలు చోట్ల ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇదే చివరి అవకాశం



పెద్దపల్లిరూరల్: రైస్‌మిల్లర్లు సీఎమ్మార్‌ను సకాలంలో డెలివరీ చేయాలని, ఇదే చివరి అవకాశమని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్‌మిల్లర్లు, అధికారులతో సమావేశమయ్యారు. 2022–23 వానాకాలానికి సంబంధించిన సీఎమ్మార్ డెలివరీపై సమీక్షించారు. మిల్లర్లవారీగా వివరాలపై ఆరా తీశారు. నిర్దేశిత గడువులోగా డెలివరీ చేయాలని ఆదేశించారు. రైస్ డెలివరీకి ఇక గడువు పెంచబోమని స్పష్టం చేశారు. సకాలంలో బియ్యం అప్పగించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో ప్రేంకుమార్ పాల్గొన్నారు.

త్వరలోనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు



రికార్డులు తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్


యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కేసులను త్వరగా పరిష్కరించేందుకు త్వరలోనే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటవుతాయని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ఠాణా ఆవరణలో మొక్క నాటారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, టూటౌన్ సీఐ రవీందర్ ఉన్నారు.

28న జెడ్పీ సమావేశం

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్(రామగుండం): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈనెల 28న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో నరేందర్ తెలిపారు. రామగుండం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో ఉదయం 11గంటలకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని ఆయన వివరించారు.

రైతన్న మురిసె..

- రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.2,000 కోట్లకుపైగా అవసరం
- గతేడాది డిసెంబరు 9లోపు తీసుకున్న వారికే!
- మార్గదర్శకాలు వస్తేనే అమలుపై మరింత స్పష్టత
- ప్రభుత్వం వద్ద ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: రాష్ట్రంలోని రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీపి కబురు తీసుకొచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం కేబినెట్‌లో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య ఐదేళ్లకాలంలో తీసుకున్న రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి ఏకకాలంలో రుణమాఫీని అమలు చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణాల మాఫీకి దాదాపుగా రూ.31వేల కోట్లకుపైగా నిధులు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు ఎంతలేదన్నా రూ.2,000 కోట్లకుపై నిధులు అవసరం అవుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో అధికశాతం చిన్న కమతాలను (ఒకటి, రెండు ఎకరాలు) సాగు చేసే రైతులే ఉన్నారు. వీరిలో పంటల ఆధారంగా ప్రభుత్వం రుణాలు ఇచ్చింది. చిన్న కమతాలను సాగుచేసే రైతులు దాదాపు 3.5 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వీరందరూ తమ సామర్థ్యం మేరకు రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న వారే. మిగిలిన వారిలో ఐదు, పది ఎకరాలకు మించి సాగుచేసే వారిలో కొందరు రూ.2 లక్షల వరకు పంటరుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న దరిమిలా.. ఇప్పుడు అధికారులు ఏ జిల్లాలో ఎంత మంది రైతులు రుణాలు తీసుకున్నారు? అన్న లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం లీడ్ బ్యాంక్ మేనేజర్లు ఇప్పటికే నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపారని సమాచారం. మార్గదర్శకాల అనంతరం లబ్ధిదారుల విషయంలో స్పష్టత రానుంది.

మార్గదర్శకాలు వస్తేనే.. స్పష్టత..

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఒకసారి మార్గదర్శకాలు వస్తే రుణమాఫీ చేసే విధానంపై అందరికీ స్పష్టత వస్తుంది. రైతు భరోసాకు విధించిన తరహాలోనే రైతు రుణమాఫీలోనూ పలు మార్పులు ఉంటాయన్న ప్రచారం సాగుతోంది. అనర్హులను ముందే గుర్తించడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది పేద రైతులకు సాయం చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయంగా కనిపిస్తోంది. అయితే, ఎవరు అర్హులు? ఎవరు అనర్హులు? అన్న విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందని తెలిసింది. అందుకే, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఐదేళ్లకాలంలో చేసినట్లుగా రుణమాఫీ చేసేందుకు సిద్ధమైందని సమాచారం. రైతు రుణమాఫీ, లబ్ధిదారుల గణాంకాలపై సమీక్ష జరిపి త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రుణమాఫీకి కావాల్సిన నిధులు కేటాయిస్తారని సమాచారం.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు, ప్రభుత్వ ఆస్పత్రులను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ రమాకాంత్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజూ ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల సంఖ్య, బాధపడే వ్యాధులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆస్పత్రుల ఆవరణ కలియతిరిగి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాతాశిశు ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. వీలైనంత వరకు సాధారణ ప్రసవాలనే ప్రోత్సహించాలని ఆదేశించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

ట్రైనీ ఐఏఎస్ అధికారులతో భేటీ..

గోదావరిఖని: ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా జిల్లాకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లను కలెక్టర్ కోయ శ్రీహర్ష కలిశారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఇల్లెందు క్లబ్‌లో కలెక్టర్ శ్రీహర్ష కలిశారు. 2022–23 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్లను సందర్శించారు. రామగుండం ఇన్‌చార్జి తహసీల్దార్ తిరుపతి తదితరులు ఉన్నారు.

హాస్టల్ అధికారుల పరీక్షకు ఏర్పాట్లు

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: వసతి గృహాల సంక్షేమ అధికారి, అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. శుక్రవారం పరీక్షల నిర్వహణపై తన కార్యాలయంలో సమీక్షించారు. ఖాళీగా ఉన్న హాస్టల్ సంక్షేమ అధికారులు, డివిజనల్ అకౌంట్స్ అధికారి పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ విధానం ద్వారా ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు హాస్టల్ సంక్షేమ అధికారులు, 30 నుంచి జూలై 4 వరకు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకోసం మూడు పరీక్ష కేంద్రాలను (పెద్దపల్లిలో ట్రినిటి, మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కాలేజీ, మంథని జేఎన్టీయూ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టభద్రత ఏర్పాటు చేయాలని, అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. డీసీపీ(అడ్మిన్) రాజు, సీఐ కృష్ణ, మైనార్టీ అధికారి మెహరాజ్‌మహమ్మద్, బండి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఆటాపాటలలో అక్షరాలు నేర్పించండి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆట, పాటలతో అక్షరజ్ఞానం అందించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. కలెక్టరేట్ సమీపంలో ఐఎంఏ హాల్‌లో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు సవరించిన పాఠ్య ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. అరుణశ్రీ హాజరై పలు సూచనలిచ్చారు. అర్హులైన పిల్లలు అందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. సవరించినప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పాఠ్యాంశాలు అందించాలని చెప్పారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్, సీడీపీవో కవిత పాల్గొన్నారు. అనంతరం మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు స్వప్న యోగా ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సీడీపీవో కవిత, ఏసీడీపీవో సంపదకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమిషనరేట్‌కు కలెక్టర్ శ్రీహర్ష



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

గోదావరిఖని: కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం రామగుండం పోలీసు కమిషనరేట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు.

స్ఫూర్తి ప్రదాత జయశంకర్‌సార్



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుదిశ్వాస వరకూ ఉద్యమించిన ప్రొఫెసర్ జయశంకర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మధు మాట్లాడారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కుమార్ ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రమేశ్(53)

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ అన్నపూర్ణకాలనీలో నివాసం ఉంటున్న కందుల రమేశ్(53) శుక్రవారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే జీవితంపై విరక్తి చెందిన రమేశ్.. తన ఇంటి ఎదుటగల పశువుల కొట్టంలో కర్రకు నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహాలు అయ్యాయి. కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి..

రామగుండం: స్థానిక రైల్వే ఓవర్ హోలింగ్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్ సిమ్మని శ్రీనివాస్(57) శుక్రవారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రైల్వేకాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ తన పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు, వ్యక్తిగత ఖర్చులకు కొంత అప్పు చేశాడు. వడ్డీ చెల్లించలేకపోవడం, అవసరాల కోసం మరికొంత అప్పు చేయడంతో చెల్లించే దారిలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో భార్య అరుణతో తరచూ అప్పు విషయం చెబుతూ బాధపడేవాడు. ఈక్రమంలో శుక్రవారం తన బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన భార్య.. ఇరుగుపొరుగు వారిని పిలిపించి కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు అభిరామ్, కూతురు శ్రీజ ఉన్నారు. పిల్లలు ఇద్దరూ అవివాహితులు. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రికే రెఫర్ చేయాలి

- పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా సహకరించండి
- కేసులు బయటకు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోండి
- సమన్వయంతో పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందిద్దాం
- డీఎంహెచ్ ప్రమోద్‌కుమార్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్
- జీజీహెచ్‌లో కనీస మర్యాద లేదని సిబ్బంది ఆవేదన



సమన్వయ సమావేశానికి హాజరైన మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ సింగరేణి మెడికల్ కాలేజీ(సిమ్స్)కు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ బోధన ఆస్పత్రి(జీజీహెచ్)లో అన్నిరకాల నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, పేషెంట్లను బయటి ఆస్పత్రులకు కాకుండా జీజీహెచ్‌కే రెఫర్ చేయాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ కోరారు. జీజీహెచ్‌లో ఓపీ కేసులతోపాటు ఇన్‌పేషెంట్ల సంఖ్య పెంచడంపై మెడికల్ కాలుజీలో శుక్రవారం సన్వయ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి హాజరయ్యారు. నగరంలోని ఆరు యూపీహెచ్‌సీలు, ఒక పీహెచ్‌సీ, రెండు బస్తీదవాఖాలు, రెండు సబ్‌సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. పిల్లలు, ప్రసూతి, జనరల్ సర్జరీ, మానసిక వైద్యం, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఆర్థో, యూరాలజీ, న్యూరాలజీ తదితర ప్రత్యేక వైద్యులు ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తునఆనరని వారు వివరించారు. ఆయా ఆస్పత్రులకు వస్తున్న పేషెంట్ల సమస్యను బట్టి జీజీహెచ్‌కు రెఫర్ చేస్తే.. అవసరమైన నాణ్యమైన వైద్యచికిత్సలు అందిస్తారని తెలిపారు. జీజీహెచ్‌లో ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నారనే విషయం ప్రజలకు తెలియకపోవడంతోనే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని వెల్లడించారు. ఔట్ పేషెంట్ల సంఖ్యతోపాటు ఇన్‌పేషెంట్ల సంఖ్య(బెడ్ ఆక్యుపెన్సీ) పెంచడానికి మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు సహకరించాలని వారు కోరారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

దురుసుగా ప్రవర్తిస్తున్నారు..

ప్రసూతి, ఇతర అత్యవసర కేసులను జీజీహెచ్‌కు తీసుకొస్తే పట్టించుకోవడం లేదని, పైగా కనీసం మర్యాద కూడా ఇవ్వడం లేదని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పేషెంట్లను తీసుకొచ్చిన తాము ఎవరిని కలువాలో కూడా అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. కొందరు సెక్యూరిటీ సిబ్బంది ఆడవారు అనికూడా చూడకుండా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గర్భిణులకు ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక బుక్‌లెట్‌ను కాదని, జీజీహెచ్‌లో డాక్టర్లు నోట్‌బుక్‌లో పరీక్షల వివరాలు నమోదు చేయడం ద్వారా అయోమయం నెలకొంటోందని డీఎంహెచ్‌తోపాటు మెడికల్ ఆఫీసర్లు ఆరోపించారు. యూపీహెచ్‌సీల నుంచి కేసును రెఫర్ చేస్తే పేషెంట్ సంబంధీకులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు సులభంగా ఎవరిని కలువాలో తెలిపేందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ పర్సన్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఏఏ విభాగాల్లో ఏ స్పెషలిస్టు డాక్టర్ అందుబాటులో ఉంటాడో తెలుసుకోవడానికి ఓపీ విభాగాల నంబర్లను విడుదల చేయాలని కోరారు. స్పందించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్.. వెంటనే చర్యలు తీసుకుంటామని, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల కోసం జీజీహెచ్‌లో ప్రత్యేక గదిని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఒక్కో స్పెషలిస్టు డాక్టర్‌ను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయితోపాటు ఆర్‌ఎంవోలు, హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో యోగా ఉత్సవ్

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీఒక్కరు ఆరోగ్యంగా జీవించాలంటే యోగా సాధన చేయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెడెట్లు పూజశ్రీ, సూర్యప్రకాశ్, యోగా శిక్షకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

పారమిత హెరిటేజ్‌లో

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు పద్మనగర్, మంకమ్మతోటలోని పారమిత విద్యా సంస్థల్లో ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా యోగాసనాలు వేసిన పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, తెలంగాణ పోలీస్ యోగా శిక్షకుడు ఉదయ్ కిరణ్‌రెడ్డి యోగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు యోగాసనాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు అనూకర్‌రావు, రమణ, వినోద్ రావు, వీయూఎం.ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న అల్ఫోర్స్ విద్యార్థులు

సెయింట్ జార్జ్‌లో

కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను శిక్షకుడు ప్రవీణ్ కుమార్ వివరించారు. ఆరోగ్యంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందని పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

రూ.కోటిన్నరతో వ్యాపారి పరార్

సిరిసిల్ల: స్థానిక మార్కెట్‌ప్రాంతంలో టీవీల షోరూం వ్యాపారి రూ.కోటిన్నరతో ఉడాయించాడు. నమ్మకంగా వ్యాపారం చేసిన సదరు వ్యాపారి రూ.కోటిన్నర వరకు తెలిసిన వారి వద్ద, సమీప బంధువుల వద్ద అప్పుగా తీసుకున్నాడు. 15 కిందటే దుకాణానికి, ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా ఊరి విడిచి వెళ్లాడు. అతనికి డబ్బులు ఇచ్చిన వారు షాపు వద్దకు వెళ్లి ఆరా తీస్తే 15రోజులుగా రావడం లేదని తెలిసింది. అనేకమంది రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు అప్పుగా ఇచ్చినట్లు తెలిసింది. సదరు వ్యాపారి పొరుగు రాష్ట్రంలో నివాసం ఉంటున్నట్లు భావిస్తున్నారు.

దొంగల హల్‌చల్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మల్లాపూర్, దేశాయిపల్లె గ్రామాల్లో రెండిళ్లలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మల్లాపూర్‌కు చెందిన బాస ఎల్లవ్వ ఆరుబయట నిద్రపోతుండా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌లకు చెందిన రూ.30వేల విలువైన రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. దేశాయిపల్లెలో తేల్ల పర్శరాములు ఇంట్లో రూ.4వేలు ఎత్తుకెళ్లారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం ముత్యంపేట గ్రామం దిగువ కొండగట్టులోని మద్యం దుకాణంలో గురువారం రాత్రి దొంగలు చొరబడి రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. దిగువ కొండగట్టులోని ఆర్‌ఆర్ వైన్స్‌ను నిర్వాహకులు గురువారం రాత్రి మూసి ఇంటికెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం రేకులను పగులగొట్టి లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణ నిర్వాహకులు శుక్రవారం ఉదయం తెరిచేందుకు రాగా రేకులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి కౌంటర్‌ను పరిశీలించగా రూ.35 వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దుకాణదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 7న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ప్రవేశం పొందితే లాడ్జింగ్, భోజనం, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందని, బుక్‌ఫండ్ నిమిత్తం మరో రూ.5 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

22 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

జగిత్యాల: ఈనెల 22, 23, 24, 25 తేదీల్లో పాలిసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని పాలిసెట్ జిల్లా కన్వీనర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. పాలిసెట్ విద్యార్థులు తమ సర్టిఫికెట్స్‌ను వారికి కేటాయించిన స్లాట్‌కు ఒక అరగంట ముందు కళాశాలకు చేరుకోవాలని అన్నారు. స్టడీ సర్టిఫికెట్లు, ఎస్సెస్సీ మెమో, టీసీ, ర్యాంక్‌కార్డు, హాల్‌టికెట్, ఆధార్, కులధ్రువీకరణ పత్రం, రెసిడెన్సీ, ఆదాయం సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లాలో మరో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఎనిమిదేళ్ల వయసుగల బాలికపై వరుసకు తాత అయిన వృద్ధుడు(65) లైంగిక దాడికి యత్నించాడు. సుల్తానాబాద్ మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏడోతరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల వయసు గల బాలిక తన ఇంటి సమీపంలో ఆడుకుంటోంది. ఆ సమీపంలోనే ఉండే వరుసకు తాత అయ్యే వృద్ధుడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికపై చేతులు వేయడంతో భయపడిన బాలిక వెంటనే ఇంట్లోకి పరుగుత్తి వెళ్లింది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బాలిక పెద్దపల్లిలోని సదనంలో ఉన్నట్లు సమాచారం. ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య జరిగిన సంఘటన మరువక ముందే సంఘటన వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

కోల్‌బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలి

గోదావరిఖని: కోల్‌బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. శుక్రవారం ఆయన క్యాంప్‌ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బొగ్గుబ్లాకుల బిల్లుకు అనుకూలంగా ఓటు వేశాయని, ప్రస్తుతం కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. సింగరేణి అన్వేషణ జరిపిన కోల్‌బ్లాక్‌లను ఆ సంస్థకే అప్పగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యం



రంజిత్

మల్యాల: దైవ దర్శనానికి కుటుంబసభ్యులతో వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మల్యాల మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. ఆత్మకూర్ మండలం కామారానికి చెందిన నర్మెట రంజిత్(25) కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చి, ఇక్కడే ఉంటున్నారు. ఈనెల 10న బహిర్భూమికి వెళ్లిన ఇతను తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి కవిత శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు.

యోగా మహిళ

కోల్‌సిటీ(రామగుండం): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని రమేశ్‌నగర్‌లో శుక్రవారం మహిళలు ప్రదర్శించిన యోగాసనాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటున్నామని, మానసిక ప్రశాంతత లభిస్తోందని సరిత, శైలజ, మాధవి, మానస, సంధ్య, కె.స్వరూప, అంజలి తదితరులు తెలిపారు.



యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్



ప్రాణాయామం చేస్తున్న న్యామూర్తులు

గోదావరిఖనిటౌన్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ఆయుష్షు పెరుగుతుందని జిల్లా అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా అదనపు కోర్టులో ఆయన అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు గణేశ్ యోగా సాధన, ప్రాణాయామం తదితర అంశాలపై వివరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ దుర్వ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీ



రామగుండంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పాలకుర్తి/రామగుండం: రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల పనితీరు, సిబ్బంది వివరాలు, వివిధ సమస్యలపై అధికారులకు అందించిన అర్జీలు, రికార్డు రూం తదితర అంశాలపై ఆరా తీశారు. మట్టి, ఇసుక అక్రమ తరలింపుపై నిఘా పెట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాలకుర్తి జెడ్పీ హైస్కూల్ సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణతో విద్యాబోధన చేయాలని సూచించారు. రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు, ఆర్‌ఐలు కుమారస్వామి, తిరుపతి, రామ్మోహన్‌రావు, శ్రీధర్, జ్యోతి, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి



ట్రాఫిక్ సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో అడ్మిన్ డీసీపీ రాజుతో కలిసి శుక్రవారం సీపీ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది, లాండ్ ఆర్డర్ పోలీసు సిబ్బందితో కలిసి ప్రజలతో మమేకమై పనిచేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ సమయంలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ, అనుమానితులను గుర్తించి విచారణ జరపాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యం



సూచనలు చేస్తున్న ఏసీపీ రమేశ్

రామగుండం: శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యతని, నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా పెడతామని గోదావరిఖని ఏసీపీ రమేశ్ అన్నారు. స్థానిక హౌసిగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం వేకువజామున కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం(కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. పోలీసు బలగాలు ఒక్కసారిగా కాలనీలోకి ప్రవేశించి తనిఖీలు చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇంటింటా సోదాలు చేసిన పోలీసులు.. ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్‌చేసి సాచారం ఇవ్వాలని కోరారు. సీఐ అజయ్‌బాబు, ఎస్సై సతీశ్ తదితరులు కాలనీవాసులు పలు అంశాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. స్వీయ రక్షణ కోసం కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వరకట్నం వేధింపులతోనే ఆత్మహత్య


- వివాహిత బలవన్మరణం ఘటనలో నలుగురిపై కేసు



విచారణ జరుపుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్ల గ్రామానికి చెందిన చిక్కులపల్లి నిర్మల ఈనెల 19న ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం చేశాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏసీపీ ఆస్పత్రిలో విచారణ జరిపారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బపూర్ గ్రామానికి చెందిన నిర్మలను సుల్తానాబాద్ మండలం నీరుకుల్లకు చెందిన తిరుపతిరావు ఇచ్చి నాలుగేళ్లక్రితం వివాహం జరిపించారని ఏసీపీ తెలిపారు. రెండేళ్ల పాటు వీరి సంసారం బాగానే ఉన్నా.. ఆ తర్వాత అదనంగా కట్నం కావాలని భర్త శారీరకంగా వేధించడంతో తల్లిగారు రూ.20లక్షలు ఇచ్చారు. మరో రూ.4లక్షలు కావాలని మళ్లీ వేధించేవాడు. ఈక్రమంలో మానస్తాపం చెందిన నిర్మల వ్యవసాయ బావిలో దూకి అత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న బాపురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త తిరుపతిరావు, బావ చందర్‌రావు, తొడికోడలు పద్మ, ఆడపడుచు రజితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరిచారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గూడ్స్‌రైలు నుంచి బియ్యం చోరీ



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు, ఆటోలు

రామగుండం: రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉంచిన గూడ్స్‌వ్యాగన్‌లోంచి బియ్యం చోరీ కేసులో గుమ్మల భీమయ్య(తిర్యాణి), జనగామ దినేశ్(మంచిర్యాల), కున్‌సోతు వెంకటేశ్, (మంచిర్యాల), అన్నెల వంశీ(మంచిర్యాల)ని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌పీఎఫ్ సీఐ సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఇటీవల మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉంచిన గూడ్సు రైలు వ్యాగన్‌లోని బియ్యం బస్తాలు చోరీ చేశారు. వాటిని ఆటోల్లో మంచిర్యాల మార్కెట్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీ నిందితులను పట్టుకున్నారు. నిందితులతోపాటు 23 బియ్యం బస్తాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రైల్వే మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కేసు చేధించిన ఆర్‌పీఎఫ్ శేఖర్‌రెడ్డి (ఏఎస్ఐ), ఐలయ్య (హెడ్‌కానిస్టేబుల్), సుమన్ (కానిస్టేబుల్) తదితరులను సీఐ అభినందించారు.

పోగొట్టుకున్న రూ.7లక్షల ఆభరణాలు అప్పగింత



ఆభరణాలు అప్పగిస్తున్న డీఎం నాగభూషణం

గోదావరిఖనిటౌన్: ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన తోట లక్ష్మి ఈనెల 19న సుల్తానాబాద్ వద్ద గోదావరిఖని డిపో బస్సులో పోగట్టుకున్న 89 గ్రాముల బంగారు ఆభరణాలను స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం అప్పగించినట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. లక్ష్మి తన కుమారుడి వైద్యం కోసం నగలు తనఖా పెట్టడానికి సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తున్న ఇదే డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణం చేసిందని తెలిపారు. ఈక్రమంలో సుల్తానాబాద్ వద్ద రూ.7లక్షల విలువైన 89 గ్రాముల బంగారు ఆభరణాలు గల బ్యాగు పోగట్టుకుందన్నారు. గుర్తించిన కండక్టర్ కె.శ్రీనివాస్ నిజాయతీగా డిపోలో అందించారని వివరించారు. సమాచారం అందుకున్న లక్ష్మి కుటుంబసభ్యులు శుక్రవారం గోదావరిఖని డిపోకు చేరుకుని తనను సంప్రదించారన్నారు. ఆధారాలు చూపించగా... ఆభరణల బ్యాగు అందదించామని చెప్పారు. కండక్టర్ కె.శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

కరెంట్ షాక్‌తో విద్యార్థి



హర్షిత్(ఫైల్)

మంథని: మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో బుద్దార్థి వర్షిత్(18) అనే ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి శుక్రవారం కరెంట్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నవీన్ కుమారుడు వర్షిత్. ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. నవీన్ ఇటీవల తన ఇంటి ఎదుట ఒక గది నిర్మించాడు. లోపలి కరెంట్ మీటర్‌ను బయట అమర్చేందుకు ఓ ఎలక్ట్రీషియన్‌తో పనులు చేయిస్తున్నాడు. ఈక్రమంలో కరెంట్ మీటర్ సర్వీస్ వైరు ఇంటి గోడ మధ్యలో ఉంది. దానిని వర్షిత్ బయటకు లాగేస్తున్నాడు. నవీన్ ఇంట్లో నుంచి బయటకు ఈ వైర్ తోస్తున్నాడు. ఈక్రమంలో వైరు తెగి హర్షిత్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన వర్షిత్‌ను స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నవీన్ ఏకైక కుమారుడు కళ్ల ముందే కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.